క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు


శాకాంబరీగా అమ్మవారు

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం శిరివెళ్ల శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం, వెంకటాపురం శ్రీ ఈశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాస పూజలు నిర్వహించారు. అమ్మవారిశాలలో ఆలయ పూజారి కేశవశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 80 కేజీల వివిధ కూరగాయలు, ఆకు కూరలతో తయారు చేసి దండతో అమ్మవారిని అలంకరించారు. కుంకుమార్చన, పాలాభిషేకం తదితర పూజలను మహిళలతో చేయించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


సుద్దమల్లలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ 1 రఘురామిరెడ్డి తల్లిదండ్రులకు చెప్పారు. శుక్రవారం మండలంలోని సుద్దమల్ల ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో మీ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్‌కు గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లైన్‌మన్

నంద్యాల(అర్బన్): పట్టణానికి చెందిన సచివాలయ విద్యుత్ లైన్‌మన్ అక్రమ్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. బాధితుడి తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి కురిసిన వర్షాలకు టూటౌన్ సమీపంలోని పెద్ద పారంకంప చెట్టు విరిగి రహదారి పక్కనున్న మెయిన్ సప్లయ్ విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో శుక్రవారం లైన్‌మెన్ అక్రమ్ అక్కడికి వెళ్లి తీగలపై పడ్డ ముళ్లకంపలను తొలగిస్తుండగా పవర్ రివర్స్ సప్లయ్ కావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందకు పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో సహ ఉద్యోగులు, స్థానికుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం (కంప్యూటర్స్, బీఎస్సీ కోర్సులలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 21 నుంచి 30వ తేదీ లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9492942337 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

లంపీ స్కిన్ వ్యాధికి టీకాలు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని లింగాపురం, భోజనం గ్రామాల్లో వెటర్నరీ డాక్టర్ అనూష ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు లంపీ స్కిన్ వ్యాధికి టీకాలు వేశారు. కార్యక్రమానికి జేవీఓ లక్ష్మీనారాయణ, ఆహ్ అర్జున్, గోపాలమిత్ర శంకర్ పాల్గొన్నారు.

పల్లకీలో మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం కనుల పండువగా సాగింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధులలో నిత్య కళా వేదికపై శ్రీశైలానికి చెందిన నృత్య కళాశాల వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, వినాయక కౌత్వం, హరహరశంభో, నమోనమో నటరాజ, శివాష్టకం, శివతాండవం తదితర గీతాలకు, అష్టకాలకు రామతులసి, అర్చన, లక్ష్మి, పూజిత తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

ప్రజల పక్షాన పోరాటం

- మోసానికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్
- ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి




దొర్నిపాడులో సమావేశానికి హాజరైన కార్యకర్తలు, ఉయ్యాలవాడలో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్‌పై అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి,ఉయ్యాలవాడలో సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఉయ్యాలవాడ: ప్రజల పక్షాన వైఎస్‌ఆర్‌సీపీ పోరాటం చేస్తుందని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ ఇంటి ఆవరణలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీపై నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పేరుతో అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. తూతూమంత్రంగా తల్లికి వందనం పథకం అమలు చేశారన్నారు. చాలా మంది అర్హులకు ఈ పథకం వర్తింపజేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 81 లక్షల మంది విద్యార్థులకు అమ్మ ఒడి పథకం వర్తింపజేస్తే, కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం 51 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే వర్తింపజేసిందన్నారు. మిగతా 30 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేసిందని గుర్తు చేశారు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇలా ఎన్నో హామీలను అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలపై ప్రజలకు వివరించేందుకు ఇంటింటికి వెళ్లాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భూమా కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఖరీఫ్‌కు ముందే మే నెలలో రైతు భరోసా కింద ఆర్థిక సహాయం అందజేసేవారన్నారు. చంద్రబాబు ఆ పథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చి 14 నెలలు గడుస్తున్నా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. రైతులకు ఇప్పటి వరకు పైసా సాయం అందలేదన్నారు. వైఎస్‌ఆర్ కుటుంబం రైతుల పక్షపాతి కుటుంబమన్నారు. బాబుకు రైతులు అంటే చులకన అని, ఎప్పుడూ ఆయన వారికి మేలు చేసే కార్యక్రమాలు చేయలేదన్నారు. కనీసం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేదని మండిపడ్డారు. రైతులు, విద్యార్థులు, తల్లులు, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గజ్జెల క్రిష్టారెడ్డి, మాజీ ఎంపీ పోచా సోదరుడు రాధాక్రిష్టారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సత్తిగారి బాలిరెడ్డి, గగ్గెర వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు గురు ప్రసాద్‌రెడ్డి, దేశం సోమశేఖర్‌రెడ్డి, జనపాల సాయిరెడ్డి, ప్రసాద్, పేరెడ్డి సుబ్బారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్లు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె మహేశ్వర రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్‌లు ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, జిల్లా బీసీ సెల్ సభ్యులు బండారు వేణు, నాయకులు కసాని రవీంద్రనాథ్‌రెడ్డి, ఎర్రి శ్రీనివాసరెడ్డి, కపురం శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కూలూరు రామకృష్ణారెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, మార్తల పెద్ద పుల్లారెడ్డి, ఆవుల రాఘవేంద్రారెడ్డి, రేనాటి నరసింహారెడ్డి, అంబటి ఈశ్వరయ్య, సరాబు దస్తగిరి, తుమ్మలూరు వెంకటేశ్వరరెడ్డి, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు మోసాలను ఎండగడుదాం


దొర్నిపాడులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నాని

దొర్నిపాడు: బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను ఎండగడుదాం అని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం దొర్నిపాడులో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. నాలుగు గ్రామాల్లో తాను పాల్గొంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరారవు, సొసైటీ మాజీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని రూపుమాపేందుకే పీ4 సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): పేదరికాన్ని రూపుమాపేందుకే స్వర్ణాంధ్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పీ4 విధానాన్ని రూపొందించిందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌టీఆర్ షాదీఖానాలో పీ-4 సర్వేపై అవగాహన కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ శేషన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బంగారు కుటుంబాలను ప్రాథమిక సర్వే ద్వారా గుర్తించామని, దీనికి సంబంధించిన తుది జాబితాను త్వరలోనే తెలియజేస్తామన్నారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాను పునః పరిశీలించి మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను వెల్లడిస్తామన్నారు. బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగానే కాకుండా చదువు, వైద్యం, మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేసేందుకు మార్గదర్శులు తోడ్పాటునందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంటకదాసు, పీ 4 సభ్యులు ఇలియాస్, పబ్బతి వేణుగోపాల్, నంద్యాల ఎంపీపీ ప్రభాకర్, గోస్పాడు ఎంపీపీ సైమాన్, తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

4 నుంచి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

నంద్యాల(న్యూటౌన్): వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో నంద్యాలలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ కోరారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను ప్రైవేటీకరణ చేసేందుకు యత్నిస్తుందన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. పీజీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ దూరం చేసే జీవో నం.77ను ఇప్పటి వరకు రద్దు చేయలేదన్నారు. రాష్ట్రంలో రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, నాయకులు గిరి, చంద్ర, రమణ, షరీఫ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అమ్మవార్లకు సారె సమర్పణ


జగజ్జననీ అమ్మవారికి సారె, బోనాలను ఊరేగింపుగా తెస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): ఆషాడ మాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకొని శ్రీజగజ్జననీ , శ్రీకాళికాంబదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు సారె సమర్పించి కోరికలు తీర్చుకున్నారు. జగజ్జననీ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అమ్మవారి ప్రతిమను అలంకరించి పుట్టింటి పట్టుచీర, సారెను తీసుకొచ్చి సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. శ్రీకాళికాంబాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఒడి బియ్యం పోశారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించి నవవిధ హారతులు ఇచ్చారు. అనంతరం కాళిమాత సేవా సమాజ్ వారు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

శాకాంబరీగా శ్రీనిమిషాంబదేవి..

పట్టణంలోని పార్కు రోడ్డులో వెలసిన శ్రీనిమిషాంబదేవి ఆలయంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి శుక్రవారం కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరీగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఆర్య క్షత్రియ చిత్తారి సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.


నిమిషాంబదేవి

శాకాంబరీగా కాశీ విశాలాక్షి

పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీ కాశీ విశాలాక్షి అమ్మవారిని శుక్రవారం శాకాంబరీగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈకార్యక్రమంలో ముందుగా లోక కల్యాణార్థం సామూహిక ఉచిత కుంకుమార్చన పూజలు చేశారు. శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీకాళికాంబాదేవి


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

జిల్లా పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాలో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని తన చాంబర్‌లో జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటికి తీసుకున్న చర్యలు, చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 24 పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జిల్లాలో చాలెంజ్ బేస్ డేస్టినేషన్ కింద అహోబిలంలో రూ.25 కోట్లతో జరుగు అభివృద్ధి కార్యక్రమాలు అటవీ శాఖతో సమన్వయం చేసుకొని తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకు డీఎఫ్‌ఓతో పర్యాటక అధికారులు, ఇంజినీర్స్ చర్చించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అప్రూవల్‌కి పంపించాలని సూచించారు. బెలుంకేవ్స్‌లో బ్రిడ్జ్ త్వరగా పూర్తి చేయాలని, అక్కడ నీటి వసతికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో డీఎఫ్ఓ అనురాగ్ శర్మ, పర్యాటక ఇన్‌చార్జి అధికారి సత్యనారాయణ, డీపీఆర్‌ఓ పురుషోత్తం, డీజీపీ ఎస్ఈ ప్రతాప్, టూరిజం అధికారులు, ఇంజనీర్లు, ఆర్కియాలజీ, ఎండోమెంట్, కేసీ కెనాల్, ఎడ్యుకేషన్, హోటల్ అసోసియేషన్, స్పోర్ట్స్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోగులకు ఉచితంగా వైద్యసేవలందించాలి

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్నిరకాల వైద్య సేవలు ఉచితంగా అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్యాధికారులకు చెప్పారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ స్కీంపై వైద్యాధికారులతో డీడీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత సేవలకు రోగుల నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయరాదన్నారు. ఏవైనా ఆసుపత్రులు డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు వస్తే ఆ ఆసుపత్రి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇందులో ముఖ్యంగా కన్సల్టేషన్ చార్జీలు, ఇన్వెస్టిగేషన్, ఎమర్జెన్సీ సేవలు పూర్తి ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఒ.లలిత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ వై.రూపేంద్రనాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఈ నెల 19న జిల్లావ్యాప్తంగా స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి జిల్లాను చెత్త రహితంగా రూపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ×ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం× అనే ఇతివృత్తంతో స్వచ్ఛ కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, మున్సిపాలిటీలు, పంచాయితీలలో ప్లాస్టిక్ కాలుష్యంపై ప్రజలకు అవగాహన పెంచి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి అన్ని శాఖలు కృషి చేయాలన్నారు.

21న పోస్టల్ సేవలు నిలిపివేత

నంద్యాల (వ్యవసాయం): ఈనెల 21న పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నంద్యాల పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ అప్పల స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సేవలను అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0లో మార్చుతున్నా సందర్భంగా ఈ అంతరాయమన్నారు. ఇందుకు పోస్టల్ కస్టమర్లు, ప్రజలు సహకరించాలని కోరారు.

పచ్చదనంపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): పచ్చదనంపై అవగాహన కల్పిస్తూ పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు అంటూ నంద్యాల పట్టణంలో శుక్రవారం శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, డీన్ దస్తగిరి, ప్రోగ్రాం ఇన్‌చార్జి ఖాజా మాట్లాడుతూ గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా పచ్చదనం యొక్క లాభాలను వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు చెట్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏఓ జునైత్, ఆర్ఐ కోటయ్య చౌదరి, ఏజీఎం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలోనే మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలి


మోడల్ స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నంద్యాల(న్యూటౌన్): బండిఆత్మకూరు మండలం పార్నపల్లె మోడల్ స్కూల్‌కు నంద్యాల మండల విద్యార్థులు వెళ్లి రావాలంటే చాలా ఇబ్బందిగా మారిందని నంద్యాలలోనే మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు నంద్యాల పట్టణంలోని క్రాంతి నగర్‌లో ఉన్న పాత మోడల్ స్కూల్‌వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. క్రాంతినగర్‌లో అద్దె భవనంలో ఉన్న మోడల్ పాఠశాల శిథిలావస్థకు చేరిందని బండిఆత్మకూరు మండలానికి మార్చారన్నారు. ప్రతి రోజు తమ పిల్లలు అంత దూరం వెళ్లి రావాలంటే ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి నంద్యాల చుట్టుపక్కల ప్రాంతంలోనే స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం..అధైర్య పడకండి


ముత్తలూరులో రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

రుద్రవరం: వ్యవసాయం కలిసి రాక ఈనెల 11 ఆత్మహత్య చేసుకున్న ముత్తలూరుకు చెందిన భాస్కరరెడ్డి కుటుంబాన్ని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం పరామర్శించారు. అధైర్యపడకండి అన్ని విధాలుగా అండగా ఉంటామని మృతుడి తండ్రి, వైఎస్సార్‌సీపీ నేత రామకృష్ణారెడ్డికి భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రసాద రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బద్రీనారాయణ, ప్రతాప్, బాల నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

రిజర్వాయర్ కల నెరవేరేనా?

- గూటుపల్లె చెరువు అభివృద్ధికి రైతన్నల ఎదురుచూపు
- నీటితో నింపితే తాగు,సాగునీటి కష్టాలు తీరినట్లేనన్న అభిప్రాయం


గోర్లగుట్ట చెరువు (ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ చెరువు రిజర్వాయర్‌గా మారితే దాదాపు 10 గ్రామాల్లో భూగర్భజలాల పెరుగుదలతో తాగునీటి సమస్య తీరుతుందని అంటున్నారు. గతంలో సరైన వర్షాలు లేకపోవడంతో గూటుపల్లె, ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం, రహిమానుపురం, కొమ్మూరి కొట్టాల, హెచ్ కొట్టాల, ఆర్ బుక్కాపురం, ఆర్ కొత్తపల్లె తదితర గ్రామాల ప్రజలు తాగునీటి కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పంటలు నష్టపోవడమే కాక, లక్షలు ఖర్చుచేసి వేసిన బోర్లకూ నీరు లేక రైతులు ఆర్థికంగా కుదేలయ్యారు. వేసవికాలంలో గుక్కెడు నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.351 కోట్లతో వాటర్‌గ్రిడ్ పథకం మంజూరైంది. ప్రస్తుతం గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా బేతంచెర్ల పట్టణంతో పాటు పలు గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోంది. అయితే మండలానికి సాగునీటి వనరులేవీ లేవు. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న రెండు చెరువుల్లో గూటుపల్లె చెరువు 175 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువును నీటితో నింపితే సమీప గ్రామాలకు రెండు సంవత్సరాల వరకూ తాగునీటి కష్టాలు ఉండవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

హంద్రీ–నీవా నుంచి నీరు నింపాలి

సాగునీటి సమస్య పరిష్కారం కోసం గూటుపల్లె చెరువుకు హంద్రీ–నీవా ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని అందిస్తే, చెరువు కింద ఉన్న ఆయకట్టు పొలాలకు సాగునీరు లభిస్తుందని, భూగర్భజలాల స్థాయి పెరిగి బోర్లలో పుష్కలంగా నీరు వస్తాయని గ్రామస్తులు అంటున్నారు. దీంతో తాగునీటి సమస్యతో పాటు వ్యవసాయ సమస్యలకూ శాశ్వత పరిష్కారం లభించనుంది.

గోర్లగుట్ట చెరువులో నీరు నిలవదు

మండల పరిధిలోని గోర్లగుట్ట చెరువు 32 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నా, వర్షాలు వచ్చినపుడే కొద్దిపాటి నీరు నిల్వ ఉంటుంది. అధికారుల ముందుచూపు లేక, సాంకేతిక లోపాల వల్ల వర్షాలు తగ్గుముఖం పట్టగానే చెరువులోని నీరు కొండచరియాల ద్వారా ఇంకిపోతుంది. ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు లేని ఈ చెరువులో నీరు నిలిచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సీమ ప్రజాప్రతినిధులదేనని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా తెలుగుదేశం పార్టీని ఇక్కడి ప్రజలు ఆదరించారని, ఇందుకు కేఆర్‌ఎంబీని ఏర్పాటు చేసి రుణం తీర్చుకోవాలన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, కేఆర్‌ఎంబీ ఏర్పాటు అయితే తప్ప ఈ ప్రాంత రైతులకు న్యాయం జరగదని చెప్పారు.